


కొత్త పెళ్ళికూతురు

పదహారేళ్ళు కళ్ళల్లో పెట్టుకు పెంచిన ఆడపిల్లకి పెళ్ళిచేసి పంపించ వలసిందే. తప్పదు. గుండెలమీద పెరిగినపిల్ల అత్తవారింట ఎన్ని బండలు మోయాలోననే దిగులు కన్నవాళ్ళని కలతపెడుతుంది. అదీ తప్పదు. మొన్న మొన్నటి వరకూ ఇంట్లో గచ్చంగాయ లాడిన పిల్ల, శ్రీ లక్ష్మీదేవిలా కళకళ లాడుతూ ఇల్లంతా తిరిగిన పిల్ల, ఎంత రాత్రయినా నిద్రమానుకుని తండ్రి కోసం ఎదురుచూసిన పిల్ల, చిన్న చప్పుడయితే చాలు అమ్మా,నాన్న వచ్చాడే మోనే అని హెచ్చరించిన పిల్ల, ఇంటిముందు రంగవల్లులు తీర్చిదిద్దిన పిల్ల, ఇంటిపనుల్లో అమ్మకి సాయపడిన పిల్ల, అల్లాంటి పిల్ల పెళ్ళి అయ్యాక అత్తవారింటికి వెళ్ళిపోతుంటే కన్నవాళ్ళకి కళ్ళు చెమ్మగిల్లుతాయి. గుండెలు

బరువెక్కుతాయి. అత్తవారెంత మంచివారయినా చీల్చి చెండాడే రకమని మనసులో అనుమానం పీకుతూనే వుంటుంది.కట్టుకున్నవాడు అపర శ్రీరామ చంద్రమూర్తి అయినా, రౌడీ వెధవేమోనన్న దిగులు కృంగదీస్తుంది.

కణ్వుడు శకుంతలని అత్తవారింటికి పంపిస్తూ విలవిల్లాడిపోయేడని ప్రత్యేకించి చెప్పుకోనక్కరలేదు. పూల మొక్కల్నీ, పక్షుల్నీ అడ్డం పెట్టుకొని మీ స్నేహితురాలు మనల్ని విడిచి వెళ్ళిపోతుంది సుమా అని కవిత్వంలో కణ్వమహర్షి తన దుఃఖాన్ని దాచుకున్నాడని కవిగారు ఫీలు చేశారు. ఆ మాటకొస్తే ఆడపిల్లని కన్న ప్రతి తండ్రీ ఒక కణ్వుడే! కొందరు గొల్లున ఏడుస్తారు.కొందరేమో గుండెల్లో బాధని దాచుకుంటారు. అదొక్కటే తేడా. ఆడపిల్లల్ని అత్తవారింటికి పంపించే దృశ్యాలను నేను చూడను. చూడవలసి వస్తే అక్కడ్నించి పారిపోతాను.

వెళ్ళిరా, మా తల్లీ వెళ్ళి రావమ్మా అని సినీమాల్లో అయితే పాట పెడతారు. జీవితంలో కుదరదు. డైలాగులే చెబుతారు. పుట్టినింటి పేరు నిలబెట్టమంటారు. మెట్టినింటి కీర్తి పెంచమంటారు. పిల్లా పాపల్తో చల్లగా వుండమని దీవిస్తారు. అత్తమామలే తల్లిదండ్రులని అర్థాలు చెబుతారు. ఆడబడుచులూ, మరుదులూ, బావలూ, అందర్నీ తోబుట్టువులుగా భావించమంటారు. ఎన్ని కష్టాలెదురయినా కన్నీరు పెట్టవద్దంటారు. పొరపాటున కూడా పుట్టింటి ఘనత అత్తవారింట పొగడవద్దంటారు. భర్తకి రంభగా, దాసిగా, తల్లిగా, మంత్రిగా వుండమంటారు. భర్త మనసెరిగి ప్రవర్తించమంటారు.

పెద్దలిన్ని చెబుతుంటే ఆ కన్నెపిల్ల యెంత గింజుకుపోతుందో నాకు తెలీదు. ఊహకందని ఆందోళన ఆ పిల్ల మనసంతా నిండిపోతుంది. గట్టిగా ఆ పిల్లకు పదహారేళ్ళు నిండవు. అమ్మా, నాన్నలను వదిలిపెట్టే తరుణం. చిట్టి తమ్ముడు, చెల్లాయిలను ఆడించేందుకు వీల్లేదు. పక్కింటి పద్మా, ఎదురింటి మీనాక్షి ఇక కనిపించరు. చెమ్మచెక్క, చారడేసి మొగ్గ—వొప్పులకుప్ప, వయ్యారి భామలకి గుడ్‌బై. వెన్నెట్లో రాకుమారుల కథలు చెప్పుకోడానికి స్వస్తి. తాను వెళ్ళే యిల్లు తానింతకు మునుపు చూళ్ళేదు. ఆ మనుషులెవ్వరో, ఆ మనస్తత్వాలేమిటో బొత్తిగా తెలీదు. భర్త

అనే పదార్థంతో యింతకు మునుపు పరిచయంలేదు. పెళ్ళి చూపులలో కూడా తలెత్తి తిన్నగా చూళ్ళేదు. తలంబ్రాలు వేసుకున్నప్పుడు చూసింది. అతని కళ్ళద్దాలు కనిపించాయేగాని అతని మొహం కనపళ్ళేదు.

మన్మథుడయినా కాకపోయినా ఫర్లేదు. బుద్ధిమంతుడయితే అదే పదివేలు. తాయారమ్మ మొగుడిలా రోజూ తాగొచ్చి చిందులు తొక్కకుండా వుంటేచాలు. రంగనాధం బాబాయిలాగా పేకాటలో పండిపోకపోతే చాలు. చెడు తిరుగుళ్ళు తిరక్కుండా వుంటే చాలు. ఇవన్నీ ఆ పిల్లకి వచ్చే అనేకానేక ఆలోచన్లలలో కొన్ని ఆందోళనలు. అత్తవారింటికి వెళ్ళే ఘడియ వస్తుంది. వర్జ్యం వస్తోంది. కారెక్కమని ముత్తైదువలు తొందరచేస్తారు. తాను వెళ్ళిపోవాలి. పుట్టి పెరిగిన ఇంటినీ, ఇంతమంది సొంత మనుషుల్నీ వదలి వెళ్ళిపోవాలి. అకస్మాత్తుగా అమ్మా, నాన్నల పాదాలమీద వాలిపోతుంది. తండ్రి కళ్ళొత్తుకుంటూ అక్కడ్నించి తప్పుకుంటాడు. తల్లి కన్నబిడ్డని గుండెలకు హత్తుకుంటుంది. అమ్మా అంటుందే తప్ప మరో అక్షరం నోటి నుంచి పెగలదు. కన్నబిడ్డవేపు తనివితీరా చూసుకుందామనుకుంటే కన్నీరొకటి. చూపు ఆనదు.

కన్నబిడ్డ కారెక్కుతుంది. కారు కదుల్తుంది. కన్నతల్లి కుప్పలా కూలిపోతుంది. కారులో కూచున్న కొత్త పెళ్ళికూతురు పెల్లుబికి వచ్చే దుఃఖాన్ని అదుపులో పెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. అయ్యో, ఇది టూకీగా ఒక పెళ్ళికూతురికి వీడ్కోలు చెప్పే దృశ్య సమాచారం. ఇది అంతాకూడా ఎవరికి వారు అనుభవమ్మీద తెలుసుకోవలసిన తియ్యటి బాధ. అంతేగాని అక్షరాలలో అందించేందుకు నావల్ల కాదు. అవి చదివి అవునను కునేందుకు మీకూ వీలుకాదు. అయితే ఇంత సుతిమెత్తగా నడిచిన కథ ఇక్కడనుంచి మరో మలుపు తిరుగుతుందని మనం అంగీకరించాలి. అన్ని కేసులూ మలుపు తిరక్కపోయినా మెజారిటీ కేసులలో మలుపులున్నట్లు సేకరించిన వివరాలను బట్టి చెప్పగలుగుతున్నాను.

పదహారేళ్ళు నిండని పుత్తడిబొమ్మ మెళ్ళో మూడు ముళ్లూ పడి అత్తవారింటికి వెళ్ళిన కొత్త రోజులలో కొంత ఇబ్బందిగానే వుంటుంది. అనుక్షణం పుట్టిల్లు జ్ఞాపకం వస్తుంటే, గోడచాటుకెళ్ళి కళ్ళు తుడుచుకుంటూనే

వుంటుంది. రాను రాను పరిస్థితులకు రాజీ పడిపోతుంది. ఈలోగా అత్త వారింట్లో వొక్కొక్కరూ అర్ధమవుతుంటారు. అందుకు కొంత అమ్మ లక్కలు సాయపడతారు. మీ అత్త గయ్యాళి అంటారు. మావ తాగుబో తంటారు. బావ తిరుగుబోతంటారు. భర్త వట్టి సుద్దముక్కంటారు. మీ పెద్దాడబడుచు మొగుడ్ని వదిలేసిందంటారు. ఇట్లాగ రకరకాల సమాచారాలు చెవి నేస్తుంటారు.

దాంతో కొత్త పెళ్ళికూతురికి తిక్కరేగుతుంది. ఏకు మేకవుతుంది. ముందర మొగుడ్ని తూకం వేస్తుంది. రెల్లుముక్కయితే సెభాషనుకుంటుంది. చురకత్తి అయితే కొన్నాళ్లు సైమిచ్చి సరిచేసుకుందామని ప్రయత్నిస్తుంది. ఆ యింటి జ్యోతిగా వచ్చినపిల్ల, ఆ యింట్లో మెల్లిగా కుంపటి వెలిగిస్తుంది. నిప్పు రాజుకుంటుంది, పొగ కమ్ముకుంటుంది. దాంతో ఇంటిల్లపాదీ ఉక్కిరి బిక్కిరై పోతారు. ఆ స్థితిలో మొగుడ్ని తీసుకొని పక్కవీధిలో అద్దె యింట్లో వేరే కాపురం పెడుతుంది - పెళ్ళికూతురు. అక్కడ్నించి కథ మామూలే. సొంత సంసారం, సొంత మొగుడు, సొంత పిల్లలు. పిల్లలు పెద్దవుతారు....తన ఆడపిల్లని కూడా అత్తవారింటికి పంపే సమయం వస్తుంది. అప్పుడు తనకి కన్నీళ్లొస్తాయి. తన పెద్దలేం బుద్ధులు చెప్పారో అవే నీతులు కన్నకూతురికి చెబుతుంది. అంచేత ఈ ఆడపిల్లల కథలు ఎక్కడ ప్రారంభించి ఎక్కడ ముగించినా, కథనం యావత్తు ఇంచుమించు వొకేలా వుంటుందని మగపిల్లల తండ్రిగా నేను నిత్యం అనుమానిస్తూనే ఉన్నాను.